# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక

నల్లగొండ | సంపుటి:16 | సంచిక:92 | ఎడిటర్: సయ్యద్ పాష | 19-04-2026 ఆదివారము | పేజీలు :8 | వెల:1/-


## లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పదుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,

## రైతులు పండించిన పంటకు సరైన ధరలు

ఖమ్మం : ఖమ్మం జిల్లా సింగరేణి(కారేపల్లి) మండల పరిధిలోని మాదారం గ్రామంలో కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటిసారిగా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను నెల కొల్పడం అందరూ హర్షించదగ్గ విషయమన్నారు. రైతులు పండించిన పంటకు సరైన ధరలు అందించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తుల బాధలు లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. మొక్కజొన్న క్వింటాలుకు మద్దతు ధర రూ. 2,400 ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా మాదారంతో పాటు పరిసర ప్రాంతాల రైతులు ఇక్కడ మొక్కజొన్నలు అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ ఒరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కార్యదర్శి నాయకులు పాల్గొన్నారు.

# దొంగల అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



కల్వచర్ల : ఇళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను రామగిరి పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ఎం రమేష్ తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు, ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి శనివారం ఉదయం కల్వచర్ల శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు గతంలో రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు.అరెస్టయినవారిలో దాసరి రవి (40), వనం పాపయ్య (31), వనం నగేష్ (30) ఉన్నారు. వీరు పగలు ఇళ్లను రెక్కీ చేసి, రాత్రి తాళాలు పగులగొట్టి బంగారం, నగదు దొంగిలించేవారని పోలీసులు తెలిపారు.

# విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకుంటాయ్

## జీవితాంతం ఆ విషయంలో చింతిస్తాయ్: ప్రధాని



న్యూఢిల్లీ:పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విపక్షాలు జీవితాంతం ఆ విషయంలో చింతిస్తాయనని మండిపడ్డారు. భారీ మూల్యం చెల్లించుకుంటాయని అన్నారు. ప్రతిపక్షాలు మహిళలకు వ్యతిరేకమనే విషయం ప్రతి గ్రామానికి చేరవేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రధాని అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం కేంద్ర క్యాబినెట్ భేటీ జరగ్గా, అందులో మోదీ ఆ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.మరోవైపు, మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకోవడం ఘోర పాపమని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును అడ్డుకుని విజయంగా భావిస్తున్న ప్రతిపక్ష పార్టీల నేతలు మహిళా విరోధులుగా మిగులుతారని విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించే బిల్లును ఆమోదించకుండా అడ్డుకోవడం దుర్మార్గమని, బిల్లును అడ్డుకుని పండుగ చేసుకోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళా బిల్లు ఎలా అప్రజాస్వామికమో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో కేంద్రానికి సదుద్దేశం ఉన్నా విపక్షాలు ఆటంకం సృష్టించాయని తెలిపారు. కేంద్రం తీసుకువచ్చిన డీలిమిటేషన్ బిల్లు కాంగ్రెస్ హయాం నాటిదేనని రిజిజు గుర్తు చేశారు. ఏదో ఒక సాకు చెప్పి బిల్లును అడ్డుకున్న ప్రతిపక్షాలు, మహిళల ఆగ్రహాన్ని ఎదుర్కో వాల్సి వస్తుందని రిజిజు చెప్పారు. "కాంగ్రెస్, ఆ పార్టీ మిత్రపక్షాలు దేశ మహిళల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. బిల్లు అంశంలో కాంగ్రెస్ పార్టీపై పడిన మచ్చ, మహిళా విరోధి అని పడిన మచ్చ ఎప్పటికీ తొలగదు. బిల్లు వీగిపోవడం అనేది కేంద్రం వైఫల్యంగా భావించవద్దు. మహిళలకు రిజర్వేషన్లు రాకుండా చేసి సంబరాలు చేసుకోవడం ఘోరమైన పాపం. ఈ ప్రపంచంలో ఈ తరహా పార్టీని ఎక్కడైనా చూశారా? మహిళలకు రిజర్వేషన్లు రాకుండా చేసి అది తమ విజయమని భావించే పార్టీ" అని కిరణ్ రిజిజు తెలిపారు.

# జగిత్యాలకు కేటీఆర్, హరీష్



జగిత్యాల : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఈ నెల 20న జగి త్యాలలో 'ప్రజా ఆశీర్వాద సభ' నిర్వహించను న్నారు. ఈ సభ ఏర్పాట్లలో బీఆర్ఎస్ కీలక నే తలు బిజీబిజీగా ఉన్నారు. స్థానిక నేతలు దగ్గరుండి సభ ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఈ ఏర్పాట్ల ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించనున్నారు.ఆ మేరకు ఆ ఇద్దరు నేతలు కలిసి శనివారం ఉదయం హరీష్‌రావు నివాసం నుంచి జగిత్యాలకు బయలుదేరారు. వారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పార్టీ కీలక నాయ కులతో సమావేశమై, సభ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. జగిత్యాలలో కేటీఆర్, హరీష్‌రావు ఇద్దరూ కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేయ నున్నారు. ఈ సమావేశంలో సభకు సంబంధించిన వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

# నో హెల్మెట్- నో పెట్రోల్- కలెక్టర్



వరంగల్, : ప్రజాపాలన--ప్రగతి కార్యాచరణలో భాగంగా జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పెట్రోల్ బంక్ యజమానులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయ డానికి "నో హెల్మెట్- నో పెట్రోల్" అనే విధానాన్ని కరి నంగా అమలు చేయాలని పెట్రోల్ బంక్ యజమాన్యాన్ని ఆదేశిం చారు. పెట్రోల్ బంకులకు వచ్చే వాహన దారులకు హెల్మెట్ అవసరంపై అవగాహన కల్పిం చాలని, నియమాలు పాటించే వారిని ప్రోత్సహిం చాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని, ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంచడంలో పెట్రోల్ బంక్ యజమానులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ పేర్కొన్నారు. శనివారం తో అరైవ్ అలైవ్ కార్యక్రమం చివరి రోజున పెట్రోల్ బంకు కి హెల్మెట్ ధరించి సీట్ బెల్ట్ ధరించి వచ్చే వారికి గులాబీ పువ్వును బహుకరించి సురక్షితమైన ప్రయాణం చేయాలని సూచించాలని వాహన దారులకు అవేర్నెస్ కల్పించే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పాల్గొన్నారు.

## భారత్ అనే భావనను పరిరక్షించడానికే బిల్లును ఓడించాం



న్యూఢిల్లీ:దేశం అనే భావనను రక్షించుకోవడానికే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పార్లమెంటులో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఓడిం చాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. తమిళనాడు పొన్నేరిలో ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న ఆయన మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్‌కు కేంద్రం యత్నించిందని మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాల బలాన్ని నిర్వీర్యం చేయడానికే బీజేపీ ఈ డీలిమిటేషన్ ఎత్తుగడ వేసిందని ఆరోపించారు. భారత్ అనేది రాష్ట్రాల సమాఖ్య అని, ప్రతి ఒక్క రాష్ట్రానికి తనకంటూ ఒక గొంతుక ఉండాలని రాహుల్ స్పష్టం చేశారు. ప్రతి రాష్ట్రం స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలగాలని, సంస్కృతీ సంప్రదా యాలను రక్షించుకునే హక్కును కలిగి ఉండాలని అన్నారు.

## లొంగిపోయిన మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు




హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో నాలుగేళ్ల క్రితం సంచలనం సృష్టించిన రోడ్డు ప్రమాదం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ అమీర్ ఎట్టకేలకు పోలీసులకు లొంగి పోయాడు. హైకోర్టు ఆదేశాల మేరకు జూబ్లీ హిల్స్ పోలీసుల ఎదుట హాజరయ్యాడు. 2022 మార్చిలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45పై వేగంగా వచ్చిన థార్ జీప్ పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో రెండు నెలల పసికందు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు మహిళలు గాయపడ్డారు. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ప్రమాదం జరిగిన వెంటనే, కారును తాను నడుపుతున్నా నంటూ సయ్యద్ అఫ్నాన్ అనే వ్యక్తి పోలీసులకు లొంగిపోయాడు. అయితే, పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా అసలు నిజం బయటపడింది. ప్రమాద సమయంలో కారు స్టీరింగ్ వద్ద రాహిల్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న రాహిల్, పోలీసులకు చిక్కకుండా దుబాయ్‌కు పారిపోయాడు. తాజాగా హైకోర్టు ఆదేశాలతో రాహిల్ లొంగిపోవడంతో ఈ కేసు దర్యాప్తు మళ్లీ వేగవంతం కానుంది.

# ఆ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం రేవంత్ ధన్యవాదాలు





న్యూఢిల్లీ/హైదరాబాద్, : వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి ఈరోజు(శనివారం) ఉదయం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో నా కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.'సమార స్వామికి ముఖ్యమంత్రి చేసిన వినతులివే..ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమార స్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా విమర్శలు గుప్పించారు. డీలిమిటేషన్ వెనుక బీజేపీ కుట్ర దాగుందని.. శాశ్వతంగా అధికారంలో ఉండేందుకే ఆ పార్టీ నేతలు ఈ రకమైన కుట్రలు పన్నుతున్నారని వ్యాఖ్యానించారు. అయితే.. విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయని ఆమె అన్నారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం వెనుక వ్యూహాత్మక రాజకీయ కుట్ర ఉందని ప్రియాంక తెలిపారు. బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండేందుకు ఈ బిల్లును వాడుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను అడ్డుకునే ప్రయత్నం చేసిందని.. విపక్షాల ఐక్యతతో ఇది వీగిపోవడంతో ప్రజాస్వామ్యం గెలిచిం దన్నారు. 'ఎన్డీఏ హయాంలో జరిగిన ఆకృత్యాలను ప్రజలు చూశారు. 2023 నాటి బిల్లును మళ్లీ తీసుకొచ్చి సభలో పెట్టండి. ఎవరు మహిళా వ్యతిరేకి అనే విషయం అప్పుడు తెలుస్తుంది. ఇతర అంశాలతో మహిళా బిల్లును కలపొద్దు. మహిళలకు తమ హక్కులను వెంటనే కల్పించాలి' అని ప్రియాంక చెప్పారు.మహిళా బిల్లును ఇతర అంశాలతో ముడిపెట్టకుండా వేరుగా చర్చించుకోవాలని, ఈ విషయంలో మహిళల హక్కులపై బీజేపీ సుస్థిర నిర్ణయం తీసుకోవాలని ప్రియాంక సూచించారు. ప్రజాస్వామ్యం, మహిళా హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని ఆమె అభిప్రా యపడ్డారు. కాగా.. ప్రియాంకా గాంధీ వ్యాఖ్యలు ఇ ప్పుడు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమయ్యాయి.

# అగ్నిగుండంగా మారుస్తున్నా భానుడి భగభగలు..



హైద్రాబాద్: భానుడి భగభగలు రాష్ట్రాన్ని అగ్నిగుం డంగా మారుస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇవి భవన నిర్మాణ కార్మికులు, దినసరి కూలీలు, చిరు వ్యాపారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే సాధారణంకంటే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వడం ఆందోళన కలిగించే అంశం. ఇప్పటికే వడదెబ్బతో జిల్లాల్లో నలుగురు మృతిచెందినట్టు వార్తలు. శనివారం ఒక్కరోజే ముగ్గురు చనిపోవడం, వారిలో ఓ మహిళా ఉపాధి కూలీ ఉండటం బాధాకరం. పనికి వెళ్లకపోతే పస్తులు, వెళ్తే ప్రాణం కోల్పోవడం అన్నట్టుగా ఉందీ పరిస్థితి. పదిజిల్లాల్లో 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వెదర్ రిపోర్టు వెల్లడించింది. మరో నాలుగురోజుల వరకు ఇదే పరిస్థితి ఉండనుందని, ప్రజలు బయటకు రావద్దని ప్రభుత్వం హెచ్చరించింది. ముప్తై జిల్లాలకు హైదరా బాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ విధించింది. ఓవైపు ఎండలు దంచికొడు తుంటే, మరోవైపు అక్కడక్కడ చిరు జల్లులతో భూమి మరింత వేడెక్కింది. ఇది కొన్నిచోట్ల వ్యవసాయంపై ప్రతికూలత చూపగా పౌల్ట్రీ రంగంపై దీని ప్రభావం మరింత ఉంది. ఎండవేడికి కోళ్లు చనిపోవడం ప్రత్యక్షంగా యజమానులకు, పరోక్షంగా కార్మికులకు దెబ్బ.గతేడాది ఇదే సమయానికి నలభై డిగ్రీల చుట్టూ నమోదైన ఉష్ణోగ్రతలు, ఈసారి నలభై ఐదు డిగ్రీలకు ఎగబాకడం తెలంగాణలో వాతావరణ సంక్షోభాన్ని ఎత్తిచూపుతోంది. మేలో రావాల్సిన ఎండలు ఏప్రిల్‌లోనే దాడిచేయడం ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. 2025 ఏప్రిల్ మధ్యలో చాలా జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 42 వద్దే ఆగాయి. కానీ, ఈ సారి దాదాపు అన్ని జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లాలో 45కి దగ్గరవ్వడం వాతావరణ హెచ్చుతగ్గులుగా చూడకూడదు, ఇది ఒక విపత్తు. తెల్లారితేచాలు ఉరుకుల పరుగుల జీవనంలో బతికే హైదరాబాద్ మహానగరంలో కూడా గతంతో పోలిస్తే రెండు డిగ్రీలు పెరిగాయి. ఎండలు ఇంతలా మండిపోవడానికి వాతావరణ మార్పు ఒక కారణమైతే, రెండోది అడవుల నరికివేత, చెరువుల మాయం, భూగర్భ జలాల క్షీణత. ఇంకా చెపాల్సివస్తే కాంక్రీట్ నగరాలు, రాజ ధాని సహా పట్టణాల్లో చెట్లు తగ్గి, సిమెంట్ బిల్డింగ్స్, గాజు భవనాల పెరుగుదల. దీంతోనే 'హీట్ ఐలాండ్ ఎఫెక్ట్' తీవ్రమవు తోందని పలు నివేదికలు చెబుతున్నాయి. ఇది అభివృద్ధే కదా అన్న వాదనలున్నా దీని సమతుల్యతను పాటించడంలో ప్రభుత్వాలు ఉదాసీనతను ప్రదర్శిస్తున్నాయి. ఫలితంగా ఎండకాలంలో ఎండలు, వానాకాలంలో వానలు విపరీతమై ప్రజల్ని చుట్టుముడు తున్నాయి.మరి పాలకులు ఏం చేస్తున్నట్టు? వారికి బాధ్యతేం లేదా?- ఎవరికైనా సహజంగా ఉత్పన్నమయ్యే ప్రశ్నలు. 'ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఎండలకు బయటకు రాకండి' వంటి ప్రకటనలకు పరిమితమైతే శ్రమ జీవుల జీవితాలు ఏం కావాలి? కుటుంబపోషణ కోసం పనిచేయకుంటే వారి ఆకలి ఎలా తీరుతుం ది? పనిప్రదేశాల్లో వసతులు కల్పించడం, ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టడం, సమయపాలన మార్చడం చాలా ముఖ్యం. కానీ, ఈ చర్యలకు ప్రభుత్వం పూనుకోవడం లేదు. పైకి ఎన్ని జాగ్రత్తలు చెప్పినా ప్రజల్ని 'ఎండ'లకు వదిలేసి పిట్టల్లా రాలుతుంటే చోద్యం చూడటం సరికాదు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కుట్లపల్లికి చెందిన రుక్కమ్మ ఉపాధి కూలీకి పోయి మధ్యాహ్నం ఇంటికొచ్చిన కాసేపటికే వాంతులు చేసుకుని చనిపోయింది. ఆమెకు కొడుకు, ఇద్దరు కూతుళ్లు. వారిని దిక్కెవరు? వ్యవసాయ కూలీలు, రైతులదీ ఇదే పరిస్థితి. వేసవికి ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టచ్చినట్టు కనిపిస్తోంది.ఉద్యోగుల పరిస్థితి కూడా భిన్నమేమి కాదు, బస్సుల కోసం గంటల తరబడి నిలబడటం, ట్రాఫిక్‌లో చిక్కుకోవడం, ఎండలో తిరిగే ఫీల్డ్‌స్టాఫ్, పోస్టుమేన్, లైన్‌మెన్, పోలీస్ సిబ్బంది-అందరూ వేడితీవ్రతను భరిస్తున్నారు. కాలేజీలు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో సరైన తాగునీరు, కూలింగ్ సదుపాయలు కూడా అరకొరగానే ఉన్నాయి. సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. వారు ఆరోగ్యంగా ఉంటేనే ప్రభుత్వ ఆదాయానికి, అభివృద్ధికి సహకరిస్తారు. నగరంలో వాహనదారులు, ఆటోడ్రైవర్లు, ట్రాఫిక్ పోలీసుల పరిస్థితి ఈ ఎండలో మరీ భయానకం. సిగల్ పడగానే రెండు మూడు నిమిషాలు వాహనాలు ఆపాల్సి ఉంటుంది. మధ్యాహ్నం వేడిగాలి భరించలేనిది. ట్రాఫిక్ కూడళ్ల వద్ద చలువ పందిళ్లు వేసి, ప్రజల్ని రక్షించాలనే నిబంధలున్నా సర్కార్ పట్టించుకోవడం లేదు. అక్కడక్కడ స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు, మజ్జిగ పంపిణీ అభినందనీయం. ఏప్రిల్‌లోనే ఎండలిలా ఉంటే మేలో తల చుకుంటేనే ఆందోళనగా ఉంది. తాత్కాలిక చర్యలు ఎన్ని చేపట్టినా ప్రజలు, ప్రభుత్వం పర్యావరణాన్ని కాపాడుకోకపోతే ప్రకృతి వైపరీత్యాలు వస్తూనే ఉంటాయి.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెంది నప్పటి నుండి ఈ దుర దృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి...

మేధస్సును పంచేవారు మనిషి, మనస్సును పంచేవారు మహర్షి అన్నారు పెద్దలు. మన విద్యాలయాల్లో అంతో ఇంతో మేధస్సును అందిస్తున్నారు. కానీ మనసును పంచేవారు కరవైపోతున్నారేమోననిపిస్తున్నది. అందుకే పరిస్థితులు వికటించి భావి భారత పౌరులుగా ఎదిగి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాల్లో అంధకారం అల్లుకొని అర్థాం తరంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందినప్పటి నుండి ఈ దుర దృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇవి రానురాను పెరిగిపోతుండడంఅందరిలోనూ ఆందోళన కలిగిస్తున్న ది. విద్యార్థి దశలోనే అర్థాంతరంగా తనువు చాలిస్తున్న భావి భారత పౌరులను చూసి భారతావని నివ్వెరపోతు న్నది. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చి కుటుం బంలో కాంతులు వెదజల్లే దీపాల్లాంటి వారు భవిష్యత్తు లో దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన దివ్వెలు ఆకస్మికంగా ఆరిపోతున్నాయి. కని, పెంచినవారి ఆశ లను చిదిమేస్తూ కుటుంబాల్లో అంధకారాన్ని నింపుతూ కనుమరుగవుతున్న ఈ విద్యాదీపాల వెనుక ఎన్నో కార ణాలు పైకి కన్పిస్తున్నా ఒత్తిడి తట్టుకోలేకపోవడమే ప్రధాన కారణమనదే కాదనలేని వాస్తవం.ఈ యేడాది ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలువడిన నిన్న ఆదివారం నాడే ఏకంగా ఏడుగురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అధికార గణాంకాలే చెబుతున్నాయి. పరీక్ష ల్లో ఫెయిల్ అయ్యామని ఏడుగురు విద్యార్థులు ఆత్మహ త్యలు చేసుకోగా, ఇంటర్మీడియేట్ ఫలితాల భయంతో మరొక విద్యార్థి ఫలితాలు వెలువడకముందే బలవన్మర ణానికి పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా భోనకల్ మండలం రావల్లి గ్రామానికి చెందిన ఒక విద్యార్థి ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియేట్ మొదటిసంవత్సరం పరీక్షలు రాసాడు. పాస్ కాననే భయంతో గత గురువారం రాత్రి ఒక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఆయన ఉత్తీర్ణుడయ్యాడు. ఇక హైదరాబాద్ లో ఇద్దరు విద్యార్థులు, మెదక్ జిల్లాలో మరొక విద్యార్థి, మహబూబ్నగర్లో, భూత్పూర్లో, సూర్యాపేటలో ఒక్కొక్క విద్యార్థి మొత్తం ఏడుగురు ఆత్మహత్యలు చేసుకున్నారు. పరీక్షా ఫలితాలు వస్తున్నా యంటే విద్యార్థుల్లోనే కాదు తల్లిదండ్రుల్లో కూడా విపరీ తమైన ఒత్తిడి పెరిగిపోతున్నది.దేశవ్యాప్తంగా కూడా ఈ బలవన్మరణాలు పెరిగిపోతున్నాయి. 2017లో దేశంలో లక్షా ఇరవై తొమ్మిది వేలమంది తమ ప్రాణాలు తీసుకుం టే 2023 నాటికి ఆ సంఖ్య లక్షా డెబ్బైవేలకు పెరిగింది. ఇవన్నీ అధికారిక లెక్కలే. వివిధ కారణాలరీత్యా వెలుగు చూడని మరణాలు కూడా ఎన్నో ఉన్నాయి. మరికొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు ఆ గర్భశోకాన్ని భరించలేక అనారోగ్యంపాలై తనువు చాలిస్తుంటే మరికొందరు బలవంతపు చావులకు కూడా వెనుకాడడం లేదు. గతం లో తమిళనాడులో మెడికల్ కాలేజీ ప్రవేశ అర్హత కోసం నీట్ పరీక్షల్లో రెండుసార్లు ప్రయత్నం చేసి విఫలమై మూడోసారి వస్తుందో లేదో అనుమానంతో పంతొమ్మిదేళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఇంటికి చేరుకొనేసరికి కుమారుడు చనిపోయి ఉండటం చూసి జీర్ణించుకోలేకపోయాడు. తల్లిలేని కుమారుడిని ఎంతో ప్రేమానురాగాలతో తల్లీతండ్రి తానే అయి అల్లారు ముద్దు గా పెంచుకున్న కొడుకు కళ్లముందే కడతేరిపోవడంతో బాధను భరించలేకపోయారు. అంత్యక్రియలు పూర్తి చేసి అదే రాత్రి ఆ తండ్రి కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రధానంగా శిక్షణా సంస్థలకు కేంద్రాలుగా పేరుగాంచిన రాజస్థాన్లోని 'కోటా'లో ప్రతి యేడాది పదుల సంఖ్యలో బలవన్మ్మణాలు చోటుచేసుకుంటున్నాయి. పోని పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసై ర్యాంకులు సంపాదించి ప్రతిష్టాకరమైన ఐఐటిల్లో, మెడిసిన్లో సీట్లు సంపాదించి ఆనందంగా చేరుతున్న విద్యార్థులు కూడా ఆతర్వాత అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. 2018- 23 వరకు ఐఐటిల్లో చదువుతున్న మెరికల్లాంటి ముప్ఫై మూడు మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ బలవంతపు చావులకు కారణాలు ఎన్నో ఉన్నా, కారకులు ఎందరో ఉన్నారు.ప్రాచీన భారత విద్యా విధానం లో కళలకు చక్కటి స్థానం ఉండేది. ఆచరణాత్మక పరీక్షా విధానాలను అవలంబించేవారు. నలంద, తక్షశిలతదితర విశ్వవిద్యాలయాల్లో పరీక్షల్లో పాల్గొనేందుకు విదేశాల నుంచి కూడా విద్యార్థులు వచ్చేవారు. అప్పటి తరగతి గదుల్లో తక్కువగా బోధించేవారు. ప్రయోగాత్మక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వ బడులే కానీ ప్రైవేట్ బడులు అంతగా ఉండేవి కావు. ఒకటి, రెండు నిర్మాహకులు లాభాపేక్ష లేకుండా విద్యాబోధనే లక్ష్యంగా నడిపేవారు. కానీ రానురాను విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందింది. మారుతున్న కాల మాన పరిస్థితులకు అనుగు ణంగా తల్లిదండ్రుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని అవ సరమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రైవేట్ విద్యపై ఆధారపడాల్సిన పరిస్థితు లు ఏర్పడ్డాయి. ఇలాంటి కారణాలు ఎన్నో విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధానానికి రూపకల్ప దిశగా మేధావులూ ఆలోచించాలి. ఈ బలవంతపు చావుల నుంచి విద్యార్థి లోకాన్ని బయటపడేసేందుకు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులను దేశం కోల్పోతుంది.

## ప్లాస్టిక్ పూల విక్రయాలపై నిషేధం

హైద్రాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకానికి సంబంధించిన మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్లాస్టిక్ పూల విక్రయాలను నిషేధించింది.. ప్రభుత్వ పూలు, పండ్ల మార్కెట్లు, రైతు బజార్లలో ప్లాస్టిక్ పూల విక్రయాలపై నిషేధం విధిస్తూ మార్కెటింగ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్లాస్టిక్ పూల అమ్మకాలు జరిపితే జరిమానా విధించాలని.. లైసెన్స్ కూడా రద్దు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మార్కెట్లు, రైతు బజార్లలో సహజ పూలను, వాటి ఉత్పత్తులనే విక్రయించేలా చూడాలని అన్ని జిల్లాల అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్లు, రైతు బజార్‌లలో సహజ పూలను పక్కన పెట్టి.. ఎక్కువగా ప్లాస్టిక్ పూలను అమ్ముతున్నారు. ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు మేళాలకు హాజరయ్యారు. కొంతమంది రైతులు ఈ ప్లాస్టిక్ పూల విక్రయాల వల్ల సహజ పూల విక్రయాలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్లాస్టిక్ పూల కారణంగా తాము నష్టపోతున్నామని మంత్రికి ఫిర్యాదు చేశారు. వెంటనే ఈ విషయం పై తుమ్మల నాగేశ్వరరావు స్పందించి.. మార్కెట్లలో ప్లాస్టిక్ పూల అమ్మకాలకు అనుమతించవద్దని ఆదేశించారు. మార్కెటింగ్‌శాఖ ప్లాస్టిక్ పూలపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ మాత్రమే కాదు.. మరికొన్ని రాష్ట్రాలు కూడా గతంలోనే ప్లాస్టిక్ పూల అమ్మకాలపై నిషేధం విధించాయి.వాస్తవానికి తెలంగాణ ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే దిశగా చర్యలుతీసుకుంటోంది. ప్లాస్టిక్‌తో కాకుండా పేపర్, క్లాత్, జనపనారతో తయారు చేసే సంచులను ప్రజలు ఉపయోగించేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు. హైదరాబాద్ పరిధిలో కూడా ప్లాస్టిక్ నిషేధం దిశగా అడుగులు వేస్తున్నారు. సింగిల్ యూస్డ్) ప్లాస్టిక్ వస్తువులపై పూర్తి నిషేధం విధించాలని నిర్ణయించింది.. ప్లాస్టిక్ నిషేధం కోసం చట్ట సవరణ ప్రతిపాదనలను కూడా సిద్ధం చేశారు. అయితే ప్లాస్టిక్ పూల విషయంలో ఫిర్యాదులు రావడంతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి నిషేధం విధించారు. ఈ నిర్ణయాన్ని రైతులు స్వాగతించారు.. తమ సమస్యను పరిష్కరించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి

సూర్యాపేట, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూర్యాపేట ఆర్డీఓ ఆర్. వేణుమాధవరావు నిర్వాహకులకు సూచించారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంతో పాటు మాచారం, అనాజీపురం, అనంతారం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మిల్లుల్లో వెంటనే ధాన్యం దిగుమతులు అయ్యే విధంగా, లారీల కొరత లేకుండా చర్యలు చేప ట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాంటాలో లేడా వస్తే నిర్వాహకులు, అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు తమ ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలన్నారు. కేంద్రాల్లో గోనె సంచులు, పట్టాలు అందుబాటులో ఉంచి రైతులకు సౌకర్యాలను కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో సమావేశం నిర్వహి ంచారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటిని త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించవద్దని, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ జి.రాజశేఖర్ రెడ్డి, ఆర్ఐ రంజిత్ రెడ్డి, కొనుగోలు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖమ్మం : ఖమ్మం జిల్లా సింగరేణి(కారేపల్లి) మండల పరిధిలోని మాదారం గ్రామంలో కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మొదటిసారిగా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను నెల కొల్పడం అందరూ హర్షించదగ్గ విషయమన్నారు. రైతులు పండించిన పంటకు సరైన ధరలు అందించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తుల బాధలు లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. మొక్కజొన్న క్వింటాలుకు మద్దతు ధర రూ.2,400 ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా మాదారంతో పాటు పరిసర ప్రాంతాల రైతులు ఇక్కడ మొక్కజొన్నలు అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్, సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ బైరు గోపి, విద్యుత్ ఏఈ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయకులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల దురాచారం సమర్థనీయం కాదు...

న్యూఢిల్లీ:పుస్తకాలు పట్టాల్సిన చిట్టితల్లులు బాల్యంలోనే పెళ్లి పీటలెక్కుతున్నారు. అన్నెంపున్నెం ఎరుగని ఆ పుత్తడిబొమ్మల మెడలో పుస్తెలతాడు ఉరితాడులా మారి ఉచ్చు బిగిస్తోంది. తెలిసీ తెలియని వయసులో పట్టుమని పదహారేండ్లు కూడా నిండని ముక్కుపచ్చలారని ఆ పసిమొగ్గలు కుటుంబ బరువు, బాధ్యతల బందీఖానాలో చిక్కి శల్యమై పోతున్నారు. పెండ్లంటే ఏమిటో తెలియకుం డానే చిన్నారులు అగాథంలో కూరుకుపోతున్నారు. మోయలేని పేదరికం ఆడపిల్ల భారం తీరుతుందని కన్నోళ్లే సంసారం అనే సాగరంలోకి నెట్టేస్తున్నారు. బాల్యవివాహాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలు, పేద కుటుంబాల్లోనే జరుగుతున్నాయి. చిన్న వయసులోనే గర్భం దాల్చి అనారోగ్యం బారిన పడి ఎన్నో జీవితాలు ఆహుతి అవుతున్నాయి. తెలంగాణలో బాల్య వివాహాల విషయంలో ఆందోళనకర పరిస్థితి కనిపిస్తోం దని సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చెబుతోంది. రాష్ట్రంలో సుమారు ఐదు శాతం అమ్మాయిలు... అంటే సుమారు 2.16 లక్షల మంది బాలికలకు 18 ఏండ్ల లోపే పెండ్లి చేస్తున్నారని సర్వేలో గుర్తించారు. చట్టపరమైన నిషేధం ఉన్నప్పటికీ.. సామాజి కంగా ఇంకా కొనసాగుతున్న సమస్యగా కనిపిస్తోంది. అబివృద్ధికి కేవలం ఆర్థిక ప్రమాణా లనే కాకుండా.. మహిళల స్థితిని కూడా సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని ఈ పరిణామాలను చూస్తే అర్థమవుతోంది. ఆర్థిక ఇబ్బందులు, త్వరగా పెళ్లిచేసి బాధ్యతలు తీర్చుకోవాలనే భావనతో చిన్నారులను చదువుకోవాలన్న ఆకాంక్షల నుంచి దూరం చేస్తున్నారు. తెలంగాణ మహిళల్లో సుమారు 65.5శాతం మంది పదోతరగతి దాటి చదవలేకపోతున్నారు. అంటే రాష్ట్రంలోని ప్రతి ముగ్గురు మహిళల్లో ఇద్దరు కనీసవిద్యను కూడా పూర్తి చేయడం లేదు. ఇది మహిళల అభివృద్ధి, సామాజిక పురోగతికి పెద్ద అడ్డంకిగా మారుతోంది.ప్రత్యేకంగా గిరిజన వర్గాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. బాల్యవివాహాలపై క్షేత్ర స్థా యిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తల్లిదండ్రులు ఈ సామాజిక దురాచారం నుంచి బయటపడలేక పోతున్నారు. రోజు కు మూడు చొప్పున కేసులు మన రాష్ట్రంలోనే నమోదవు తున్నాయి. బాల్య వివాహాల నిరోధక చట్టం, చైల్డ్‌లైన్‌పై అవగాహనతో ఎవరై నా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తేనే ఈ కేసులు వెలుగులోకి వస్తున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా జరుగు తున్న బాల్య వివాహాలకు లెక్కేలేకుండా పో తోంది. "మేలిమి బంగరు మెలతల్లారా.. కలువల కన్నుల కన్నెల్లారా.. తల్లులగన్నా పిల్లల్లారా.. విన్నా రమ్మా ఈ కథను.." అంటూ గురజాడ అప్పారావు బాల్యవివాహపు ఉక్కుకోరల్లో చిక్కు కుని బలైపోయిన బాలిక గురించి రాసిన దీనగాథ "పుత్తడిబొమ్మ పూర్ణమ్మ" కథ. ఆ పూర్ణమ్మల కథలు నేటికీ కొనసాగుతుండటం అత్యంత విషాదం. రాజధాని పరిసర ప్రాంతాలు సైతం అభివృద్ధిలోనే కాదు.. సామాజిక వెనుకబాటు లోనూ ముందుండటం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసినా అది నిష్టుర సత్యం. గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరగడానికి కారణం అవిద్య, అవగాహనా లేమి కారణాలుగా కనిపిస్తున్నాయి. సమాజాన్ని ఆవరించిన అభద్రతా భావం కూడా ఆడపిల్లలకు శాపంగా మారింది.పిల్లలకు సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగడానికి, అభివృద్ధి చెందటానికి రక్షణ పొందే హక్కును రాజ్యాంగం కల్పించింది. బాల్య వివాహం వారి హక్కులను హరిస్తుంది. ఆడపిల్లలు అంతరిక్షంలోకి వెళ్తున్న నేటికాలంలో కూడా ఇప్పటికీ దేశంలో బాల్య వివాహాలు జరగడానికి కారణాలేమిటి? కేవలం అభివృద్ధిలోనే కాకుండా ప్రజల ఆలోచనల్లోనూ వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తోంది. సమాజం ఎప్పుడో వదిలేసిన అమా నుష ఆచారాలు కొనసాగుతున్నంత కాలం ఎన్ని చట్టాలు వచ్చినా నిరుపయోగమే. నేడు హిందూత్వ ఎజెండాను బలంగా అమలు చేస్తున్న మనువాదుల పాలనలో ఉన్నాం. పాలకగణం చట్టాలను అమలు చేయడం కంటే ప్రజలను అశాస్త్రీయత వైపు నడిపించడానికే ప్రాధాన్యత ఇస్తున్నది. దాని ఫలితం చట్ట విరుద్ధమని తెలిసినా ఇప్పటికీ బాల్య వివాహాలు ఆగడంలేదు. దీని కారణంగా రానున్న దశాబ్దంలో కోట్లాది మంది బాలికలు బాల్య వివాహాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదంఉందని యునిసెఫ్ హెచ్చరించింది.ఏదిఏమైనా బాల్యవివాహాల దురాచారం సమర్థనీయం కాదు. దీన్ని అరికట్టినప్పుడే యువతులకు వ్యక్తిగత స్వేచ్ఛ, ఎంపికలకు అవకాశం ఉంటుంది. తద్వారా మహిళా సాధికారతకు మేలైన బాట పడుతుంది. దేశం పురోగతి సాధిస్తున్న క్రమంలో మహిళలకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తుండ టంపై చైతన్యం కల్పించడం ద్వారా బాల్యవివాహాలను నిరోధించాలి. ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప ఈ బాల్య వివాహాల్ని అడ్డుకోవడం కష్టం.

## తెలంగాణలో ఐదు యూనివర్సిటీకు కొత్త ఈసీలు

హైద్రాబాద్: రాష్ట్రంలోని ఐదు విశ్వవిద్యాలయాలకు కార్యానిర్వాహక మండలి(ఈసీ) సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడున్నర సంవత్సరాల తరువాత యూనివర్సిటీలకు ఈసీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా, జేఎన్టీయు, శాతవాహన, తెలంగాణ యూనివర్సిటీలతోపాటు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెనన యూనివర్సిటీలకు ఈసీలను నియమిస్తూ విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. కాకతీయ యూనివర్సిటీకి ఇప్పటికే ఈసీని నియమించిన సంగతి తెలిసిందే.రాష్ట్రంలోని జేఎన్ఎఫ్ఎయు, సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, మహాత్మాగాంధీ యూనివర్సిటీలకు ఈసీలను నియమించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గురువారం జారీ చేసిన జీవోల్లో ఈసీ సభ్యులుగా నియమితులైన వారి పదవికాలం ఎప్పటి వరకు ఉంటుందనేది చెప్పలేదు. వాస్తవంగా ఈసీ పదవి కాలం సాధారణంగా మూడు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. అయితే ఈ విషయాన్ని ప్రభుత్వం జీవోలో వెల్లడించలేదు. రాష్ట్రంలో ఉస్మానియా, జెఎన్టియు, ఎసు, టియు, ఓపెన్ వర్సిటీలకు ఈసీల నియామకం పెండింగ్లో నాలుగు వర్సిటీలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సుమారు రెండున్నర సంవత్సరాల తరువాత యూనివర్సిటీలకు ఈసీలను నియమించింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్ ఛాన్స్ లర్ (వీసీ)లను నియమించి ఏడాది గడిచిన తరువాత ఇపుడు ఈసీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ: క్లాస్–2 మెంబర్లా ప్రొఫెసర్ పి.ఉషారాణి, ప్రొఫెసర్ ఎం. విజ్జులత, డాక్టర్ తుమ్మలూరి శ్రీలక్ష్మి, బి.సుజాత నాయక్, డాక్టర్ జె.నీరజ, డాక్టర్ బాణాపురం మధుసూదన్ రెడ్డి, నర్రి యాదయ్య, సురం రవీందర్రెడ్డి, ప్రొఫెసర్ జి.గోపాల్ రెడ్డిలను నియమించారు.జేఎన్టియు: క్లాస్–2 ఈసీ సభ్యులుగా డాక్టర్ ప్రకాష్, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు, శ్రీనివాస మూర్తిలను నియమించారు.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ: క్లాస్–2 ఈసీ సభ్యులుగా సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి నిత్యానందరావు, టి సాట్ సీఈవో బి వేణుగోపాల్ రెడ్డి, బి వెంకటేశ్వరరావు, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా రావులను నియమించారు.శాతవాహన యూనివర్సిటీ: క్లాస్–2 ఈసీ సభ్యులుగా వంగాల మురళీ మోహన్, కవిత ఆలేటి, ఊట్కూరి రవీందర్ రెడ్డి, శ్రీపురం ఈశ్వర్లను నియమించారు. తెలంగాణ యూనివర్సిటీ: క్లాస్–2 ఈసీ సభ్యులుగా చెరుకూరి రజనీకాంత్, అల్లే లావణ్య, మహ్మద్ ఘజీ, డాక్టర్ ఎస్ జయంత్లు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత: డీజీపీ శివధర్ రెడ్డి




కరీంనగర్,: ప్రతీ ప్రాణం విలువైనదేనని, రోడ్డు భద్రతను పాటించడం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్లో అరైవ్- అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి హాజరైన డీజీపీ మాట్లాడుతూ వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ క్షే మంగా తమ ఇళ్లకు చేరుకోవాలనే ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టిందని తెలిపారు.రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య కంటే రోడ్డు ప్రమాదాలే అతిపెద్ద సవాలుగా మారాయన్నారు. గత ఏడాది రాష్ట్రంలో హత్యల వల్ల 800 మంది ప్రాణాలు కోల్పోగా, రోడ్డు ప్రమాదాల వల్ల ఏకంగా 7500 మంది మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. రోడ్డు భద్రత కేవలం పోలీస్, రవాణా శాఖల బాధ్యత మాత్రమే కాదని, వార్డు మెంబర్ నుండి ముఖ్యమంత్రి వరకు అందరూ ఇందులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని తెలిపారు.అందుకే మొదటిసారిగా పోలీస్ శాఖ కార్యక్రమాన్ని ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో చేర్చడం జరిగిం దన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో 70శాతం మరణాలు ద్విచక్ర వాహనదారులవే ఉంటున్నాయని, బైక్ నడి ఎ వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, తప్పనిసరిగా స్ట్రిప్ పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించడం అనేది ప్యాంటుకు బెల్టు ఎట్టుకున్నంత సహజంగా అలవరచుకోవాలని కోరారు. ఫోర్ వీలర్ వాహనాల్లో ప్రయాణించే అందరూ సీట్ బెల్ట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకుంటేనే ప్రమాద సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకుంటాయని, ప్రయాణికులు వాహనం వెలుపల పడకుండా రక్షణ లభిస్తుందని వివరిం చారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్ ప్రయాణించడం, ఓవర్ కాన్ఫిడెన్స్ డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్ల ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయని వివరించారు. వాహ నదారులు ఎల్లప్పుడూ పరిసరాలను గమనిస్తూ 'డిఫెన్సివ్ డ్రైవింగ్' చేయాలని, ముఖ్యంగా స్కూళ్లు, గ్రామాల జంక్షన్ల వద్ద వేగాన్ని తగ్గించాలని సూచించారు. పాదాచారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, వారు ఎల్లప్పుడూ వాహనాలు వచ్చే ఎదురు దిశలో నడవాలని తెలి పారు. మైనర్లకు వాహ నాలు ఇచ్చి వారి ప్రాణాలతో చెలగాటం ఆడవ ద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చె శారు. లైసెన్స్ వచ్చిన తర్వాతే పిల్లలకు వాహనాలు ఇవ్వాలని, విద్యార్థులు కూడా బైకుల కోసం తల్లిదండ్రులపై ఒత్తిడి తేవద్దని కోరారు. అరైవ్ అలైవ్ సందేశాన్ని గ్రామ గ్రామానికి తీసుకువెళ్లి రోడ్డు ప్రమాద రహిత తెలంగాణను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని, డీఎంహెచ్ వెంకటరమణ, ఎంవీఐ చక్రవర్తి, ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకటరమణలు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

భువనగిరి : : ఉపాధి కూలీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ సిద్దగోని శ్రీకాంత్ గౌడ్ సూచించారు. బీబీనగర్ మండలంలోని రాఘవాపురం గ్రామ పరిధిలో ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొన్న మహిళా కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి కూలీలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పని చేసే సమయంలో తరచూ నీరు తాగడం, తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం, మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవడం, అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా నీరసం, అలసట వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, ఏపీఓ కళావతి, టీఏ రమేశ్ పాల్గొన్నారు.

# నాగబాబు వల్ల కానిది నీహారిక చేస్తోంది



తండ్రుల వల్ల కానిది పిల్లలు చేసి చూపిస్తే అదో ఆనందం. నాగబాబు ప్రస్తుతం ఈ స్థితిని అనుభవిస్తున్నారు. నిర్మాతగా నాగబాబు ట్రాక్ రికార్డు మెగా ఫ్యాన్స్ కి బాగా తెలుసు. అన్నయ్య చిరంజీవితో తీసిన మొదటి ప్రొడక్షన్ డెబ్యూ 'రుద్రవీణ' కమర్షియల్ గా పెద్ద ఫెయిల్యూర్. చిరు వందో సినిమా 'త్రినేత్రుడు' ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆయన ట్రిపుల్ రోల్ చేసిన 'ముగ్గురు మొనగాళ్లు' సైతం హిట్టుకి ఆమడ దూరంలో ఆగిపోయింది. ఇవేవి సక్సెస్ ఫుల్ మూవీస్ కాదు. ఒక్క 'బావగారు బాగున్నారా' మాత్రమే హిట్టు కొట్టి అంజనా ప్రొడక్షన్స్ బ్యానర్ కి కొంత మైలేజ్ ఇచ్చింది. ఆ తర్వాత మళ్ళీ మాములే. 'గుడుంబా శంకర్' పెద్ద స్థాయిలో ఆడుతుందనుకుంటే వర్కౌట్ కాలేదు. 'ఆరెంజ్' ఏకంగా ఓ రేంజ్ నష్టాలు తెచ్చిన డిజాస్టర్. రామ్ చరణ్, పవన్ కళ్యాణ్ ఇద్దరూ నిలబట్టలేకపోయారు. దీంతో నాగబాబు ప్రొడక్షన్ కు దూరంగా ఉండిపోయారు. కొడుకు వరుణ్ తేజ్ హీరో అయ్యాక కూడా రిస్కులు వద్దనుకుని జనసేనకు షిఫ్ట్ అయిపోయారు. కట్ చేస్తే నాగబాబు కూతురు నిహారిక నిర్మాతగా పెద్ద అడుగులే వేస్తోంది. ఇంట్లోనే స్టార్లు ఉన్నా వాళ్ళ వెంటపడకుండా కొత్త టాలెంట్ ని నమ్ముకుని సినిమాలు తీయడం మంచి ఫలితం ఇస్తోంది. 'కమిటీ కుర్రాళ్ళు' గట్టి పోటీలోనూ హిట్టు కొట్టి డబ్బులతో పాటు అవార్డులు కూడా తీసుకొచ్చింది. తాజాగా 'రాకాస'కు రెవిన్యూలు బాగున్నాయి. శర్వానంద్ బైకర్ లాంటి గట్టి పోటీ ఉన్నా సరే రాకాస తట్టుకుని నిలబడింది. సినిమా ఎక్స్ట్రాడినరి లేకపోయినా జనాన్ని ఓ మోస్తరుగా మెప్పించినట్టే ఉంది. అన్న వరుణ్ తేజ్ తో ఆల్రెడీ 'బరి'ని మొదలుపెట్టిన నీహారిక ఆ అవకాశం కూడా కమిటీ కుర్రాళ్ళు దర్శకుడికే ఇచ్చింది. నాగబాబు లాగా పెద్ద బడ్జెట్ లను రిస్క్ లో పెట్టకుండా థియేటర్, ఓటిటి రెండింటిపరంగా సేఫ్ అయ్యే కాంబోలనే నీహారిక సెట్ చేసుకున్న వైనం స్పష్టం. ప్రమోషన్ల విషయంలో తను చూపిస్తున్న యాక్టివ్ నెస్ అంతా ఇంత కాదు. ఏకంగా రామ్ చరణే మాట సాయం చేశాడు. కొణిదెల ప్రొడక్షన్స్ పెట్టాక చరణ్ కూడా ఒక స్టేజి తర్వాత ఆగిపోయాడు. కానీ నీహారిక ఆపేలా లేదు.

# శేష్‌ను చూసి అసూయ చెందిన హీరో ఎవరు?



టాలీవుడ్లో అడివి శేష్‌ది విచిత్రమైన ప్రయాణం. హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో కర్మ, కిస్ సినిమాలు తీసి బొక్క బోర్లా పడ్డ అతను.. తర్వాత విలన్ పాత్రలు చేసి మెప్పించాడు. ముఖ్యంగా 'పంజా' సినిమాలో అతను చేసిన నెగెటివ్ రోల్‌కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఆపై 'క్షణం' సినిమాతో ప్రేక్షకులకు పెద్ద షాకే ఇచ్చాడు శేష్. ఈ చిత్రంలో లీడ్ రోల్ చేయడమే కాక.. రచనలోనూ భాగమైన శేష్.. మేకింగ్ కూడా దగ్గరుండి చూసుకున్నాడు. ఆ సినిమా సర్ప్రైజ్ బ్లాక్‌బస్టర్ అయి.. శేష్‌కు చాలా మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత కూడా ఇదే మోడల్ ఫాలో అవుతూ.. గూఢచారి, ఎవరు, మేజర్ చిత్రాలతో ఆకట్టుకున్నాడు శేష్. 'హిట్-2' సైతం అతడికి పెద్ద విజయాన్ని అందించింది. ఇప్పుడు శేష్ నుంచి రాబోతున్న డెకాయిట్, గూఢచారి-2 చిత్రాల మీద భారీ అంచనాలే ఉన్నాయి. 'క్షణం' సినిమాను కోటి రూపాయల బడ్జెట్లో చేసిన తాను.. ఇప్పుడు వంద కోట్ల బడ్జెట్లో 'గూఢచారి-2' చేసే లెవెల్‌కు ఎదిగానంటూ ఒక ఇంటర్వ్యూలో ఇంట్రెస్టింగ్ కామెంట్ చేశాడు శేష్. ఐతే తన రేంజ్ పెరగడం గురించి ఇటీవల ఒక స్టార్ హీరో ఒకింత అసూయతో తన వద్ద ఓ కామెంట్ చేశాడంటూ శేష్ ఆసక్తికర విషయం వెల్లడించాడు. తన నిర్మాత బర్త్‌డే పార్టీలో కలిసిన ఆ హీరో తనకు చెయ్యి ఇస్తూ "నువ్వు నా రేంజ్ బడ్జెట్లలో సినిమాలు చేసే స్థాయికి ఎదిగిపోయావు" అని కామెంట్ చేశాడని శేష్ అన్నాడు. ఈ కామెంట్‌ను ఇంగ్లిష్‌లో చెప్పిన శేష్.. తెలుగులో సదరు హీరో స్టయిల్లో చెబితే అతనెవరో కనిపెట్టేస్తారని వ్యాఖ్యానించాడు. ఈ కామెంట్ వినగానే.. ఇంత కుళ్లేంటి అనుకున్నానని శేష్ తెలిపాడు. ఈ వీడియో వైరల్ కావడంతో శేష్‌తో ఈ కామెంట్ చేసిన హీరో ఎవరా అని నెటిజన్లు ఊహాగానాలు చేయడం మొదలుపెట్టారు. ఇండస్ట్రీలో నువ్వెంత నేనెంత అని పోల్చుకునే గేమ్ అయిపోయిందని.. కానీ తాను ఉన్న యంగ్ హీరోలందరిలోకి తోపు అయిపోవాలనుకుంటే.. ఆరుగురు టాప్ హీరోలున్నారని.. వాళ్లను దాటితే రజినీకాంత్, చిరంజీవి ఉన్నారని.. వాళ్లను మించి కింగ్ ఖాన్ ఉన్నాడని.. ఆయన కంటే పైన టామ్ క్రూజ్ ఉన్నాడని.. కాబట్టి దీనికి అంతెక్కడ అని శేష్ వ్యాఖ్యానించాడు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే వేముల

నకిరేకల్, : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, నకరికల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని సత్యసాయి ఫంక్షన్ హాల్లో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ప్రజలకు అందించిన వివిధ సంక్షేమ పథకాల అమలు తీరును ఎమ్మెల్యే వివరించారు. ప్రస్తుత ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి, విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ ఉందని పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ సుమారు రూ. 8 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ను మంజూరు చేయించుకున్నామని, త్వరలోనే మండల కేంద్రంలో ఎమ్మార్వో తహసిల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, స్థానిక మున్సిపల్ చైర్మన్ చెవుగోని రజిత-శ్రీనివాస్, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


# యుద్ధంతో ఏవియేషన్ రంగానికి భారీ నష్టం

న్యూఢిల్లీ: ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా దాని ప్రభావం సామాన్యుడి జేబు మీద పడుతుంది. ప్రస్తుతం ఇరాన్ ఉద్రిక్తతల వల్ల భారత విమానయాన రంగం ఊహించని సంక్షోభంలో కూరుకుపోయింది. ఏకంగా రూ. 18,000 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని నివేదికలు చెబుతున్నాయి. విమాన మార్గాలు మారడం, ఇంధన ధరలు పెరగడం వల్ల ప్రయాణ సమయం పెరగడమే కాకుండా, సామాన్యులకు విమాన ప్రయాణం భారంగా మారుతోంది. ఈ యుద్ధ మేఘాలు మన ఆకాశ ప్రయాణాలను ఎలా దెబ్బతీస్తున్నాయో చూద్దాం. సాధారణంగా పశ్చిమ దేశాలకు వెళ్లే విమానాలు ఇరాన్ మీదుగా వెళ్తుంటాయి. కానీ ఇప్పుడు యుద్ధ భయంతో ఆ గగనతలాన్ని మూసివేయడం లేదా విమానాలు వెళ్లడానికి భయపడటంతో రూట్లను మార్చాల్సి వస్తోంది. ఇలా మార్గాలను మళ్లించడం వల్ల ఒక్కో ప్రయాణ సమయం ఏకంగా 4 గంటల వరకు పెరుగుతోంది. దీనివల్ల పైలట్లు, సిబ్బంది పని గంటలు పెరగడమే కాకుండా, విమానయాన సంస్థల షెడ్యూల్స్ మొత్తం తలకిందులవుతున్నాయి. గమ్యస్థానానికి త్వరగా చేరుకోవాలనుకునే ప్రయాణికులకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. విమానయాన సంస్థలకు అతిపెద్ద ఖర్చు అంటే అది ఇంధనమే. విమానం గాల్లో అదనంగా నాలుగు గంటలు ఉండాల్సి రావడం వల్ల ఇంధన వినియోగం భారీగా పెరిగింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇక దీంతో విమాన టికెట్ల ధరలు కూడా పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. కేవలం ఈ ఇంధన భారం వల్లే ఎయిర్‌లైన్స్ కంపెనీలు కోట్లాది రూపాయల అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. ఇది నేరుగా ప్రయాణికులపైనే ప్రభావం చూపుతోంది. నివేదిక ప్రకారం, ఈ యుద్ధ పరిస్థితుల వల్ల భారత్‌కు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య సుమారు 20% వరకు తగ్గే అవకాశం ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా చాలా మంది తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు లేదా వాయిదా వేసుకుంటున్నారు. ఇక దీనివల్ల హోటళ్లు, రవాణా, టూరిజంపై ఆధారపడ్డ లక్షలాది మంది ఉపాధి దెబ్బతింటోంది. కేవలం విమానయానమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న పర్యాటక రంగం కూడా ఈ యుద్ధ ప్రభావంతో వణికిపోతోంది. యుద్ధం వల్ల కలిగే నష్టం కేవలం దేశాల సరిహద్దులకే పరిమితం కాదు, అది మన విమాన ప్రయాణాల వరకు పాకింది. రూ. 18,000 కోట్ల నష్టం అనేది చిన్న విషయం కాదు. పరిస్థితులు త్వరగా చక్కబడకపోతే, ఏవియేషన్ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం ఉంది. యుద్ధం ఆగి, మళ్లీ ప్రశాంతమైన ఆకాశంలో విమానాలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ప్రయాణించాలని కోరుకుందాం. పౌర విమానయాన శాఖ కూడా ఈ నష్టాలను తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

# ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన కారు..

బెంగళూరు: అదుపుతప్పిన కారు, ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగడంతో ఆ రెండు వాహనాలు కాలిపోయాయి. కారులో ప్రయాణించిన ఒకే కుటుంబానికి చెందిన 9 మంది మరణించారు. మృతుల్లో నలుగురు పిల్లలున్నారు. కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మధ్యాహ్నం సురపూర్ తాలూకాలోని శాంతాపూర్ క్రాస్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక కుటుంబం ప్రయాణిస్తున్న కారు టైర్ పేలిపోయింది. అదుపుతప్పిన ఆ కారు ఎదురుగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఢీకొట్టింది. ఆ వెంటనే మంటలు చెలరేగాయి. కారు, ట్రావెల్స్ బస్సు పూర్తిగా దగ్ధమయ్యాయి. కాగా, కారులో ప్రయాణించిన ఒకే కుటుంబానికి చెందిన పది మందిలో 9 మంది మరణించారు. కారులో చిక్కుకున్న ఇద్దరు పిల్లలతో సహా నలుగురు సజీవదహనమయ్యారు. మృతులను కృష్ణ నాయక్ (52), ఆయన భార్య అనంత కళ (45), శరణప్ప (36), ఆయన భార్య నిసర్గ (30), వారి పిల్లలు సిద్ధార్థ (3), అద్విక్ (5), శ్రీనిధి (1.5), శశికళ (30), ఆమె కుమారుడు చందన్ (8)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. శశికళ మరో కుమారుడైన విరాట్ (10) ఒక్కడే ప్రాణాలతో బయటపడినట్లు చెప్పారు. గాయపడిన ఆ బాలుడ్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు కారులో ప్రయాణించిన వారు రాయచూర్ జిల్లాలోని సిర్వార్ తాలూకాకు చెందినవారని పోలీస్ అధికారి తెలిపారు. యాద్గిర్ నుంచి రాయచూర్‌లోని వారి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. అయితే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బెంగళూరు నుంచి కలబురగికి ప్రయాణిస్తున్నది పోలీస్ అధికారి తెలిపారు. ఆ బస్సులోని 20 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని, వారిని సకాలంలో రక్షించినట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# రాజధాని పరిధిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ..




హైద్రాబాద్: తెలంగాణలో నగర, పట్టణ జనాభా లో లింగ నిష్పత్తి చాలా ముందంజలో ఉంది. గతేడాది తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఆధారంగా తాజాగా విడుదలైన తెలంగాణ అర్బన్ డెమోగ్రాఫిక్ టేబుల్స్ (2024) గణాంకాల ప్రకారం రాజధాని పరిధిలోని జిల్లాల్లో పురుషుల కంటే మహిళల సంఖ్య ఎక్కువగా ఉండటం ఇక్కడ విశేషం. జీహెచ్ఎంసీ, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సామాజిక వర్గాల వారీగా లింగ నిష్పత్తిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు, ప్రజల్లో అవగాహన, మారుతున్న సామాజిక దృక్పథానికి ఈ ఫలితాలే నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. జీహెచ్ఎంసీలో : జీహెచ్ఎంసీ పరిధిలో లింగనిష్పత్తి 1078గా ఉంది. అంటే ఇక్కడ ప్రతి 1000 మంది పురుషులకు 1078 మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా బీసీ-ఏలో (1090), బీసీ-ఈ (1087), ఓసీల్లో (1108) వర్గాల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా బలంగా ఉంది. ముస్లిం మైనారిటీలు(బీసీ-ఈ)లో లింగ నిష్పత్తి 1087గా ఉంది. బీసీ-సి(962) వర్గాల్లో మాత్రం పురుషులతో పోలిస్తే మహిళల జనాభా తక్కువగా ఉంది. రంగారెడ్డి జిల్లాలో 1095 లింగ నిష్పత్తితో తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలిచింది. మేడ్చల్ జిల్లాలో సగటు లింగ నిష్పత్తి 1066గా ఉంది. ఈ జిల్లాల్లో ఎస్టీ సామాజిక వర్గంలో 1088, ఓసీల్లో 1097, బీసీల్లో 1053 నిష్పత్తిలో మహిళలు ఉన్నారు. ఎస్సీల్లో సగటు 1026గా ఉంది. 1000 : 1095నగర జీవనంలో అతివల సారథ్యం : పట్టణ ప్రాంతాల్లో సామాజిక మార్పు స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మూడు జిల్లాల గణాంకాలను పరిశీలిస్తే కుటుంబానికి మహిళలు వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు ఈ లెక్కలు చెబుతున్నాయి. జీహెచ్ఎంసీలో 21.8 శాతం, రంగారెడ్డి జిల్లాలో 20.4శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 18.9శాతం మంది మహిళలే ఇంటి యజమానులుగా ఉండటం అభినందనీయమైన విషయం. ఈ లెక్కన తెలంగాణవ్యాప్తంగా సగటు 23.9 శాతంగా ఉంది. నెలకు రూ. 5 వేల సంపాదన : మహానగరం హైదరాబాద్ లో నెలకు కేవలం రూ. 5 వేలలోపు సంపాదనతో సగటున 9 శాతం మంది జీవనం కొనసాగిస్తున్నారు. ఇది రాష్ట్ర సగటు(12శాతం) కంటే తక్కువగా ఉంది. రంగారెడ్డి జిల్లాలో 9.3 శాతం, జీహెచ్ఎంసీలో 9.2 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 8.1 శాతం మంది ప్రజల వార్షిక ఆదాయం ఏడాదికి రూ. 50 వేల లోపు మాత్రమే ఉంది. ఇంకా బావులు, చేతి పంపులు : గ్రేటర్ హైదరాబాద్ లో 89 శాతం మందికి కుళాయిలు ఉండగా మేడ్చల్ జిల్లాలో 86.3 శాతం, రంగారెడ్డి జిల్లాలో 85.3 శాతంగా ఉంది. గ్రేటర్ పరిధిలో చేతిపంపులపై ఆధారపడిన వారు ఇప్పటికీ 3.3 శాతం, మేడ్చల్ జిల్లాలో 2 శాతం, రంగారెడ్డి జిల్లాలో 2.4. శాతం మంది ఉన్నారు. కులాంతర వివా హాల్లో టాప్ : రాష్ట్రంలోనే కులాంతర వివాహాల్లో అగ్రస్థానంలో జీహెచ్ఎంసీ ఉండగా తర్వాత స్థానాల్లో మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలు చోటు దక్కించుకున్నాయి. గ్రేటర్ పరిధిలో 14.3 శాతం కులాంతర వివాహాలు జరగ్గా, మేడ్చల్ జిల్లాలో 9.9. శాతం, రంగారెడ్డి జిల్లాలో 8.4 శాతంగా నమోదు అయ్యాయి. ముందస్తు వివాహాలు అధికం : జీహెచ్ఎంసీలో ముందుస్తు వివాహాలు ఎక్కువగా ఉన్నాయి. 11.1 శాతం మంది పురుషులు పెళ్లి వయస్సు రాక ముందే వివాహాలు చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలో 7 శాతం పురుషులు, 7.3 శాతం స్త్రీలు, మేడ్చల్‌లో పురుషులు 6.6శాతం, స్త్రీలు 6.8శాతం మేర చట్టబద్ధ వయసులోపే వివాహ జీవితంలోకి అడుగుపెట్టారు. వైద్యం కోసం, రుణమే శరణ్యం! : వైద్య చికిత్సల కోసం పేదలు రుణాలు తెచ్చి మరీ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలున్నప్పటికీ ఏ మాత్రం ఊరట లేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో దాదాపు 11.5 శాతం మంది మెడికల్ పరంగా అప్పులు చేస్తున్నారు. నగరంలోని ఎస్సీ కేటగిరీ పేదలు దాదాపు 12.5 శాతం మంది అప్పుల కోసం అనధికార వడ్డీ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. గ్రేటర్‌లో అక్షరాస్యులు 90 శాతం : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు జిల్లాల్లో కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలిస్తే ఆరేళ్ల నుంచి 29 ఏళ్ల వారిలో చదువుకున్న వారు 90 శాతం మంది ఉన్నారు. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 84.7శాతం మంది ఉండగా, అత్యధికంగా మేడ్చల్ జిల్లాలో 90.4శాతం మంది విద్యావంతులున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చదువుకున్న విద్యార్థుల్లో అత్యధికంగా ఇంగ్లీష్ మీడియం వారున్నారు. రెండో స్థానంలో తెలుగు, మూడో స్థానంలో ఉర్దూ మీడియం విద్యార్థులు ఉన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో తెలుగును మాతృ భాషగా మాట్లాడేవారు 53.10శాతంమంది ఉంటే, ఉర్దూ మాతృ భాషగా మాట్లాడేవారు 37.5 శాతం మంది. హిందీ మాతృ భాషగా మాట్లాడుతున్న వారు 6 శాతం ప్రజలు ఉన్నారు.

# సామాన్య ప్రజలపై మరో భారం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్త సరఫరా గొలుసును దెబ్బతీస్తూ, భారత్‌లోని సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం కారణంగా ముడిచమురు ధరలు పెరగడం, రవాణా మార్గాల్లో ఏర్పడిన అడ్డంకులు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు ప్రధాన కారణమవుతున్నాయి. చమురు ధరలు పెరిగితే ఆ ప్రభావం కేవలం పెట్రోల్, డీజిల్ ధరలపైనే కాకుండా, ప్లాస్టిక్ తయారీకి వాడే పెట్రోకెమికల్స్ మరియు ప్యాకేజింగ్ ముడి పదార్థాలపై కూడా పడుతుంది. దీనికి తోడు ఎర్ర సముద్రం వంటి కీలక నౌకాయాన మార్గాల్లో దాడుల భయంతో రవాణా నౌకలు సుదీర్ఘ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తోంది. దీనివల్ల నౌకా రవాణా ఖర్చులు మరియు ఇన్సూరెన్స్ ప్రీమియంలు విపరీతంగా పెరిగి, తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. ఈ వ్యయాలన్నీ చివరికి ఉత్పత్తి ధరల రూపంలో వినియోగదారుడిపైనే పడుతున్నాయి. ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనీలీవర్ వంటి కంపెనీలు ఇప్పటికే తమ ఉత్పత్తుల ధరలను సవరిస్తున్నాయి. ముఖ్యంగా మనం రోజువారీ వాడే సబ్బులు, షాంపూలు, సర్ఫ్ వంటి వస్తువుల తయారీలో వాడే 'పామ్ ఆయిల్' మరియు ఇతర రసాయనాల రేట్లు పెరగడం కంపెనీలకు భారంగా మారింది. లిరిల్, పియర్స్, డవ్ వంటి ప్రీమియం బ్రాండ్ల ధరలను రూ. 2 నుండి రూ. 3 వరకు పెంచడం ప్రారంభమైంది. ఒక్కో వస్తువుపై రెండు, మూడు రూపాయల పెరుగుదల చిన్నదిగా కనిపించినా, నెలాఖరుకు మొత్తం కిరాణా బిల్లును చూసినప్పుడు అది సామాన్యుడి బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల కేవలం సబ్బులు, షాంపూలకే పరిమితం కాకుండా ఇతర రంగాలకు కూడా పాకుతోంది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల కూరగాయలు, పప్పు ధాన్యాల రవాణా కూడా ఖరీదైనదిగా మారుతుంది. పశ్చిమాసియాలో పరిస్థితులు సద్దుమణిగితే తప్ప ఈ ద్రవ్యోల్బణం తగ్గే సూచనలు కనిపించడం లేదు. కంపెనీలు తమ లాభాలను కాపాడుకోవడానికి ఈ అదనపు భారాన్ని వినియోగదారులపైకి నెట్టడం వల్ల, ఇప్పటికే అధిక ధరలతో సతమతమవుతున్న మధ్యతరగతి మరియు పేద ప్రజలు మరింత ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. రాబోయే రోజుల్లో ఇతర కంపెనీలు కూడా ఇదే బాటలో నడిచే అవకాశం ఉండటంతో వినియోగదారులు పొదుపు మంత్రం జపించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే ఆటోమేటిక్‌గా చలాన్లు




న్యూఢిల్లీ: నేషనల్ హైవేలపై ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికట్టేందుకు ఎన్‌హెచ్ఏఐ ఏఐ కెమెరాలను ఉపయోగిస్తోంది. ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘించే వాహనాల ఫోటోలను తీసి.. ఆటోమేటిక్‌గా చలాన్లు విధించేలా సరికొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎన్‌హెచ్-44పై ఈ ఏఐ కెమెరాలను ఏర్పాటు చేసి వాహనదారులపై నిఘా పెట్టారు. మరోవైపు.. ఇప్పటికే ఏర్పాటు చేసిన హైవేపై ఈ ఏఐ కెమెరాలు సూపర్‌గా పనిచేయడంతో మరిన్ని హైవేలకు విస్తరిస్తున్నారు. హైలైట్: సాధారణంగా వాహనదారులు.. హైవేలు ఎక్కారంటే చాలు.. రయ్ మంటూ దూసుకెళ్తూ ఉంటారు. గరిష్ఠ వేగం గంటకు 80 కిలోమీటర్లు, 100 కిలోమీటర్లు అని బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా స్పీడు పెంచుతూనే ఉంటారు. ఇక ట్రాఫిక్ పోలీసులు ఉండరు కాబట్టి.. ఇష్టం వచ్చినట్లు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తూ ఉంటారు. అతి వేగం, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు పెరిగిపోవడంతోపాటు ప్రాణాలు పోతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) కీలక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే హైవేలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేసి.. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులకు ఆటోమేటిక్‌గా చలాన్లు జారీ చేస్తోంది. దేశంలోనే అతి కీలక నేషనల్ హైవేల్లో ఒకటైన ఎన్‌హెచ్-44 పై డిజిటల్ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఎన్‌హెచ్ఏఐ అనేక చర్యలు చేపట్టింది. ఈ ఎన్‌హెచ్-44లోని హైదరాబాద్-ఆదిలాబాద్ సెక్షన్‌లో ప్రతి 2 కిలోమీటర్లకు ఒక ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనలో దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా ఇల్చిపూర్, మెదక్ జిల్లా చేగుంట వద్ద ఏర్పాటు చేసిన 2 ఫొటో, 2 వీడియో కెమెరాలు పని చేస్తున్నాయి. ఈ కెమెరాలు.. వాహనాల వేగంతోపాటు బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్ పెట్టుకోకపోవడం.. కారులో వెళ్లేవారు సీట్ బెల్ట్ ధరించకపోవడం.. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలను ఆటోమేటిక్‌గా గుర్తించి.. వారికి ట్రాఫిక్ చలాన్లను జారీ చేస్తున్నాయి. ఇక ఇల్చిపూర్, చేగుంటల్లో ఉన్న ఫొటో కెమెరాలతో నెలకు సగటున 10 వేల చలాన్లు జారీ చేసినట్లు లెక్కలు ఉన్నాయి. ఇక వీడియో కెమెరాల ద్వారా 15 వేల చలాన్లు జారీ చేయడం అంటే వాటి పనితీరు, కచ్చితత్వానికి నిదర్శనమని ఎన్‌హెచ్ఏఐ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇక హైదరాబాద్ నగరంలోనూ భారీగా ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూ. 150-200 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రణాళికలు అమలు అయితే.. హెల్మెట్, ట్రిపుల్ రైడింగ్ చేసేవారిని నడిరోడ్డుపై ఆపాల్సిన అవసరం లేకుండానే.. ఆటోమేటిక్‌గా కెమెరాలతో వారికి ట్రాఫిక్ చలాన్లు జారీ చేస్తారు. గతంలో భారీగా రోడ్డు ప్రమాదాలు జరిగే మహారాష్ట్రలోని ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ప్రమాదాల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలోనే పైలట్ ప్రాజెక్టు కింద అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ఎన్‌హెచ్-44లోని హైదరాబాద్-ఆదిలాబాద్ సెక్షన్‌ను ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఎంపిక చేశారు.

# ఈ నెల 20న కేసీఆర్ భారీ బహిరంగ సభ



జగిత్యాల : ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ బహ్రెయిన్ అధ్యక్షులు రాధారపు సతీష్ కుమార్ పిలుపు నిచ్చారు. ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లలో ఆదర్శవంతమైన పాలన అందించారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష ను నెరవేర్చడా నికి బీఆర్ఎస్ పార్టీని స్థాపించి అనేక పోరాటాలు చేసి తన ప్రాణాలను పణంగా పెట్టి, అమర వీరుల త్యాగాలతో రాష్ట్రాన్ని సాదించిన కేసీఆర్ గొప్ప పరిపాలనాదక్షుడని పేర్కొన్నారు . కేసీఆర్ విజన్ దేశానికే ఆదర్శమని కొనియాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభ అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతుందని వివరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీల గురించి నిలదీస్తే బీఆర్ఎస్ నాయకులను వేదింపులకు గురిచేస్తూ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు మళ్లీ సంతోషంగా ఉండాలంటే రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని తెలిపారు. ఈకార్యక్రమములో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ అధ్యక్షులు రాధారపు సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేష్ , ప్రధాన కార్యదర్శులు మగ్గిడి రాజేందర్, అన్నారం సుమన్ , కార్యదర్శులు చెన్నమనేని రాజేందర్ , సంగేపు దేవన్న , కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

# డబ్బుల కోసం నకిలీ కిడ్నాప్ డ్రామా..




పంజాబ్ : పంజాబ్ లో ఓ యువకుడు డబ్బుల కోసం నకిలీ కిడ్నాప్ డ్రామా ఆడాడు. కెనడాలో ఉన్న తన అక్క పంపిన రూ.5 లక్షలను కాజేయాలనే ఉద్దేశంతో యువకుడు తన స్నేహితులతో కలిసి కిడ్నాప్ ప్లాన్ చేశాడు. తానే అపహరణకు గురైనట్టు కథను సృష్టించాడు. కట్ చేస్తే పోలీసుల ఎంట్రీతో గంటల్లోనే అసలు విషయం వెలుగులో వచ్చింది. ఆ నకలీ కిడ్నాప్ స్టోరీ ఏంటో తెలుసుకుందాం.డబ్బు విత్ డ్రా కో సం వెళ్లి కిడ్నాప్పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పంజాబ్ లోని మాన్సా జిల్లా లోని ఖియాలా కలన్ గ్రామంలో రాజ్ సింగ్ అనే వ్యక్తి నివసిస్తున్నాడు. ఇటీవల విదేశాల్లో ఉంటున్న అతడి కుమార్తె రాజ్ సింగ్ ఖాతాలో రూ. 5 లక్షలు జమ చేసింది. ఆ డబ్బును విత్ డ్రా చేసుకురమ్మని రాజ్ సింగ్ అతని కుమారుడు సందీప్ సింగ్ ను బ్యాంక్ కు పంపాడు. సందీప్ తో పాటు తన స్నేహితుడు కేసర్ సింగ్ బ్యాంకు నుంచి డబ్బులు విత్‌డ్రా చేయడానికి వెళ్లారు. తర్వాత కొంత సేపటికీ సందీప్ కిడ్నాప్ అయినట్లు రాజ్ సింగ్ కు కాల్ వచ్చింది. ఆర్ టీఓ కార్యాలయం సమీపం లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని తెలిసింది.గంటలోనే బయట పడిన అసలు నిజం దీంతో రాజ్ సింగ్ 112 కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. తన కుమారుడు సందీప్ సింగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేశాడు. అతను బ్యాంక్ నుంచి డబ్బులు తీసుకుని వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, కొద్ది గంటల్లోనే పోలీసుల కేసును ఛేదించారు. కిడ్నాప్ గురించి సందీప్ ను ప్రశ్నించగా అసలు నిజం బయట పడింది. డబ్బుల కోసం నకిలీ కిడ్నాప్ చేసినట్లు విచారణలో ఒప్పుడుకున్నాడు. తన స్నేహితులు కేసర్ సింగ్, సుఖచైన్ సింగ్‌లతో కలిసి నకిలీ కిడ్నాప్ కథను సృష్టించినట్లు తెలిపాడు. డబ్బులు డబుల్ అవుతాయనే ఆశతో స్నేహి తుల మాటలు నమ్మి ఈ పని చేశానని చెప్పాడు.తప్పును కప్పిపుచ్చడానికి డ్రామాకెనడా నుంచి తన ఖాతాలో జమ అయిన డబ్బును మాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ పథకం రచించినట్లు పోలీసులు వెల్లడించారు. 'బ్యాంకు నుంచి నగదును తీసుకున్న తర్వాత వాటిని రెట్టింపు చేస్తామని బఠిండాకు చెందిన ఓ వ్యక్తి చప్పాడు. ఆ మాటలు నమ్మి సందీప్ , కేసర్ లు అతన్ని వాళ్ల ఇంటికి తీసుకెళ్లారు. అందు కోసం రూ.10 వేల రూపాయలు తీసుకున్నారు. ఆ తర్వాత రూ.2.5లక్షల నగదును రెట్టింపు చేసే ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలోనే మంటల్లో ఆ డబ్బులు కాలిపోయాయి. దీంతో ఏం చేయాలో తేలీక ఈ కిడ్నాప్ డ్రామను సిద్ధం చేశారు' అని పోలీసులు తెలిపారు. పోలీసుల దర్యాప్తులో రూ.2.30 లక్షలు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సుమారు రూ.20 వేలును ఖర్చు చేసినట్లు నిందితులు చెప్పారు.తప్పడు సమాచారం ఇస్తే జైలే ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన సందీప్ సింగ్, కేసర్ సింగ్, సుఖ్‌చైన్ సింగ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఎస్ పీ భగీరథ్ సింగ్ మీ నా తెలిపారు. తదుపరి విచారణ జరుపు తున్నారని అన్నారు. నిందితులు ఆ డబ్బులో కొంత భాగాన్ని ఖర్చు చేసినట్లు వారు అంగీకరిం చారని ఆయన చెప్పారు. అలాగే ఈ కేసులో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ జరుపుతున్నారని తెలిపారు. ఎవరైనా పోలీసులకు తప్పుడు సమాచారం ఇస్తే, వారు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని భగీరథ్ సింగ్ మీనా హెచ్చరించారు.

# అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలి

హనుమకొండ, : తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని, వారి కి తాను తోడ్పాటునందిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ జన్మదినాన్ని పురసరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల విజేతలకు చెక్, ట్రోఫీలను హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో కలిసి కేటీఆర్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో గొప్ప క్రీడా పాలసీ తీ సుకురావాల్సిన అవసరం ఉన్నదని, వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు.అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి కృషి చేస్తామని తెలిపారు. దాస్యం వినయన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ కప్ స్ఫూర్తితో వచ్చే ఏడాది కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యం లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ గులాబీ శ్రేణులు, కాకతీయ క్రికెట్ అకాడమీ సభ్యులను కేటీఆర్ అభినందించారు. దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఓరుగల్లు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కేసీఆర్ జన్మదినాన్ని పురసరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 8 ఏండ్లుగా కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విజేతలకు చెక్, ట్రోఫీ ప్రదానం కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నీ విన్నర్, రన్నర్‌గా నిలిచిన 51, 49వ డివిజన్ జట్లకు నగదు, ట్రోఫీని కేటీఆర్ ప్రదానం చేశారు. డిపార్ట్‌మెంట్ క్రికెట్‌లో విన్నర్‌గా నిలిచిన అంజలి కిడ్నీ కేర్ సెంటర్ హాస్పిటల్, రన్నర్‌గా నిలిచిన సంకీర్తన హాస్పిటల్ టీంకు సైతం ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో కాకతీయ క్రికెట్ అకాడమీ (కేసీఏ) ఫౌండర్ చైర్మన్ ఫారుక్ అలీ, కేసీఏ మెంబర్స్ మాజీద్, వీరు, సిరాజ్, రాజేశ్, రాంబాబు, 51వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్‌రావు, ప్రెసిడెంట్ ఫిరోజ్, నాలుగో డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

# భర్తను హత్య చేయించిన భార్య అరెస్ట్

వరంగల్ : అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భార్య, ప్రియుడు కలిసి సుఫారీ ఇచ్చి భర్తను చంపించన ఘటన కేసును వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు ఛేదించారు. హనుమకొండ లోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఐదుగురి నిందితులను అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 8న వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి పరకాల టౌన్ కు చెందిన మడికొండ సుమన్ భరత్ కనబడడం లేదని తండ్రి సాంబయ్య పిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఊహించని విధంగా భార్య లావణ్యనే భర్తను చంపించినట్లు తేలింది.లావణ్యకు పరకాలకు చెందిన ఇమ్మడి నరేష్ తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయంలో భర్త సుమన్ భరత్ మద్యం సేవించి భార్య లావణ్యను హించినేవాడు. భర్త అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడు నరేష్, ఆమె తమ్ముడు పెండల రాజు కలిసి భరత్ ను హత్య చేయడానికి ములుగు జిల్లా గోవిందారావు పేటకు చెందిన చిరంశెట్టి వెంకటేశ్వర్లు, భూక్య రాకేష్ తో సుఫారీ హత్యకు రూ.5లక్షలు డీల్ కుదుర్చుకొని రూ.4లక్షల,60 వేలు ఇచ్చారు.ఏప్రిల్ 3 న వెంకటేశ్వర్లు, రాకేష్ మృతుడు భరత్ ను ములుగుకు పిలుపిం చుకున్నారు. ముగ్గురు మద్యం సేవించారు. అక్కడి నుంచి వెంకటేశ్వర్లు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి, వెంకటేశ్వర్లు, రాకేష్ ఇద్దరు కలిసి భరత్ తల పై బీర్ బాటిల్ కొట్టి చంపి, పెట్రోల్ పోసి తగలబెట్టారు. వీడియో తీసి లావణ్య ఫోన్ కు పంపించారు. భరత్ డెడ్ బాడీని కాల్చి, ఆనవాళ్లు లేకుండా బొక్కలను సమీపంలోని వాగులో పడేశారు. తరువాత లావణ్య రూ.40 వేలు వెంకటేశ్వర్లకు అందజేసినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు.


# వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గంగాధర, : రోడ్డు భద్రతలో భాగంగా గంగాధర పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు శ్రీజ వ్యాసరచన, వర్షిత్ చిత్రలేఖనంలో ప్రతిభ కనబరచగా కరీంనగర్లో నిర్వహించిన కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చేతుల బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రోడ్డు భద్రతపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటించడంలో రోల్ మోడల్‌గా నిల వాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివార ణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ట్రాఫిక్ సిగ్నల్స్, హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నివారించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాణాలు చాలా విలువైనవని, 'అరైవ్ అలైవ్' (సురక్షితంగా చేరుకుందాం) అనే నినాదంతో రోడ్డు క్రమశిక్షణను పాటించాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పర్రెం లక్ష్మారెడ్డి, డైరెక్టర్ గుడి అనంతరెడ్డి విద్యార్థులను అభినందించారు.

# రామగుండానికి ఎండ దగడు..

రామగుండం : రామగుండం అగ్నిగుండంగా మా రింది. అడుగు బయట పెడదామంటే అగ్గిలా మం డుతుంది. ఉదయం 7 గంటల నుంచి ఎండ దగడు జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రామ గుండంలో గడిచిన నాలుగు రోజులు ఈ ప్రతి కూల వేడి వాతావరణం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. గరిష్టంగా 40 డిగ్రీలు దాటడంతో వడగాలులు.. ఉక్క పోత తో ప్రజలు బెంబేలెత్తిపోయారు.సాయంత్రం 6 దాటినా దగడు తగ్గడం లేదు. వృద్ధులే కాదు యువకులు సైతం.. ఎండకు తట్టుకోలేక అస్వస్థతకు గురవుతున్నారు. వారం రోజుల కిందట గోదావరిఖని జీఎం కాలనీకి ఎల్ఐసీ ఏజెంట్ శ్రీనివాస్ అనే వ్యక్తి వడదెబ్బకు గురై మృతి చెందిన సంఘటన విధితమే. అయితే అనూహ్యంగా వాతావరణంలో రోజురోజుకు వేడి తీవ్రత పెరుగుతుండడంతో ఆందోళనకరమైన పరిస్థితి నెలకొంది. కూలర్లు, ఫ్యాన్ల ముందు కూర్చున్నా వేడి నుంచి ఉపశమనం కలగడం లేదు. వివిధ భారీ పరిశ్రమలకు నిలయంగా ఉన్న రామగుండంలో ప్రతీ ఎండాకాలం రికార్డు స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడం సాధారణమే అయినప్పటికీ... ప్రస్తుత ప్రతికూల పరిస్థితి ప్రజలకు ముచ్చెమటలు పట్టిస్తోంది. ఈ ప్రమాదకరమైన ఎండల కు ప్రజలు బయటకు రాకుండా ఉండడమే శ్రేయస్కరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దంటూ అధికారులు హెచ్చరిక జారీ చేస్తున్నారు.

# సమస్యలను వినడటం కష్టంగా మారింది: అమిత్‌షా



న్యూఢిల్లీ: డీలిమిటేషన్ ప్రధాన ఉద్దేశాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలోక్‌సభకు వివరించారు. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉందని చెప్పారు. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం అమిత్‌షా లోక్‌సభలో సమాధానమిస్తూ, నియోజకవర్గాల్లోని జనాభాలో భారీ వ్యత్యాసం కారణంగా ఒక్కో ఎంపీ లక్షలాది మంది ఓటర్ల సమస్యలను వినడటం కష్టంగా మారిందన్నారు. ఒక చోట 39 మంది లక్షల మంది ఓటర్లుంటే, మరో చోట 60 వేల మంది ఓటర్లున్నారని, ఇలా నియోజకవర్గాల్లో జనాభా వ్యత్యాసాలున్నాయని చెప్పారు. డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. తద్వారా ఎంపీ లాడ్స్‌ను కూడా సమర్థవంతగా వినియోగించుకునే వీలుంటుందని చెప్పారు.మహిళా రిజర్వేషన్లకు విపక్షాలు వ్యతిరేకమనే విషయాన్ని కేంద్ర హోమంత్రి అమిత్‌షా తప్పుపట్టారు. వారిది మహిళా వ్యతిరేక మైండ్‌సెంట్ అన్నారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు ప్రభుత్వాన్ని నమ్మాలని అన్నారు. పార్లమెంటు సభ్యుల సంఖ్యను విస్తరించేందుకు, వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముందుకు వెళున్నామని చెప్పారు. మూడు బిల్లులపై లోక్‌సభలో సమగ్రంగా చర్చ జరిగిందని, అన్ని పార్టీలు తమ వాదనలు వినిపించాయని, ఇండియా కూటమి సభ్యుల్లో చాలామంది మాట్లాడారని అన్నారు. దక్షిణాది ప్రాతినిధ్యం పెరుగుతుంది..రాజ్యాంగ సవరణ వల్ల దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం బలహీనమవుతుందనడంలో ఎంత మాత్రం నిజం లేదని అమిత్‌షా వివరించారు. బిల్లు ఆమోదం తర్వాత దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే సభ్యులు, శాతం రెండూ పెరుగుతాయని వివరించారు. ప్రస్తుతం 543 మంది లోక్‌సభ సభ్యుల్లో దక్షిణాదిన 129 మంది ఎంపీలు ఉన్నారని, అది 195కు పెరుగుతుందని చెప్పారు. పార్లమెంటులో దక్షిణాది ప్రాతినిధ్యం పెరగడం వల్ల బలమైన గొంతు వినిపించే అవకాశం ఉంటుందని వివరించారు.ఇండి కూటమి సభ్యులు బిల్లును వ్యతిరేకించారు: అమిత్ షా మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు మరో మూడు కీలక బిల్లులపై లోక్‌సభలో సుదీర్ఘ చర్చ ముగిసింది. ఈ సందర్భంగా అమిత్ షా ప్రతిపక్ష 'ఇండి' కూటమి లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని 'ఇండి' కూటమి సభ్యులు వ్యతిరేకించడం విచారకరమని అమిత్ షా అన్నారు.మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడం ఎందుకని అమిత్ షా కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల్ని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన మూడు బిల్లులకు మహిళా రిజర్వేషన్ల బిల్లుతో విడదీయలేని సంబంధం ఉందని ఆయన వివరించారు. ఈ ప్రక్రియ అంతా ఒక పద్ధతి ప్రకారం సాగుతోందని చెప్పారు.నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించడం అంటే.. ఎస్సీ ), ఎస్టీ సీట్ల పెంపును వ్యతిరేకించడమేనని అమిత్ షా అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వ్‌డ్ సీట్ల సంఖ్య పెరగాలంటే పునర్విభజన అనివార్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం వివిధ లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ సమాన ప్రాతినిధ్యం దక్కాలంటే పునర్విభజన అవసరమని అమిత్ షా నొక్కి చెప్పారు.వచ్చే సాధారణ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో అమలు చేసేలా మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని అమిత్ షా ప్రకటించారు. సభలో ప్రస్తుతం 56 మంది మహిళా ఎంపీలు ఉండటం శుభపరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# 4 కులాల్లోనే 40శాతం మంది పేదలు!

హైద్రాబాద్: తెలంగాణ సమాజంలో లోతుగా పాతుకుపోయిన సామాజిక, ఆర్థిక అసమానతలను సీపెక్ తాజా సర్వే నివేదిక మరోసారి కళ్లకు కట్టింది. అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నామని భావిస్తున్న తరుణంలో నిర్దిష్ట కులాలు, వర్గాలు ఇంకా పేదరికం, నిరక్షరాస్యత, అస్థిరమైన ఉపాధి కోరల్లోనే చిక్కుకుని ఉన్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సామాజిక న్యాయం, సమాన వృద్ధి అనే లక్ష్యాలకు ఈ అసమానతలు పెను సవాలుగా మారాయి. పేదరికంలో అగ్రభాగం ఆ నాలుగు కులాలే!సర్వే వెల్లడించిన అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే.. రాష్ట్రంలో వార్షికాదాయం రూ. లక్ష లోపు ఉన్న నిరుపేదల సంఖ్య సుమారు 1.10 కోట్లు. ఇందులో దాదాపు 40 శాతం మంది కేవలం నాలుగు కులాలకు చెందినవారే కావ డం గమనార్హం. మాదిగ, లంబాడా, ముదిరాజ్, యాదవ కులాల్లో పేదరికం తీవ్రస్థాయిలో ఉంది. తరతరాలుగా వస్తున్న సామాజిక వివక్షతో పాటు.. సరైన భూవసతి లేకపోవడం.. సంప్రదాయ వృత్తులు లాభసాటిగా లేకపోవడం వీరిని పేదరికంలోకి నెట్టివేస్తున్నాయి. ఆర్థిక వనరుల లభ్యత తక్కువగా ఉండటం వల్ల ఈ కులాల్లోని యువత కొత్త వ్యాపారాలు లేదా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయలేకపోతున్నారు.విద్యలో భారీ వ్యత్యాసాలు 5% వర్సెస్ 35%విద్యా రంగంలో ఉన్న అసమానతలు భవిష్యత్తు తరాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉన్నత విద్యకు సంబంధించి సర్వే ఆసక్తికరమైన, ఆందోళనకరమైన విషయాలను బయటపెట్టింది. కొన్ని అభివృద్ధి చెందిన కులాల్లో ఉన్నత విద్యావంతుల శాతం 35.37%గా ఉంటే, వెనుకబడిన కొన్ని వర్గాల్లో ఇది 5% లోపే ఉండటం గమనార్హం. విద్య అనేది పేదరికం నుండి బయటపడటానికి ఉన్న ఏకైక మార్గం.. కానీ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ వర్గాలు ప్రాథమిక విద్యకే పరిమితమవుతున్నాయి. దీనివల్ల ఐటీ, సాఫ్ట్‌వేర్ మేనేజ్‌మెంట్ వంటి అధిక వేతనం వచ్చే రంగాల్లో ఈ కులాల ప్రాతినిధ్యం నామమాత్రంగానే మిగిలిపోతోంది.బాల కార్మిక వ్యవస్థ.. ఉపాధి సంక్షోభంకుటుంబ పోషణ భారం చిన్నారి చేతులకు పని కల్పిస్తోంది. ముఖ్యంగా మాదిగ , ఎస్టీ వర్గాల్లో బాల కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండటం సామాజిక వెనుకబాటుతనానికి పరాకాష్ట.అదేవిధంగా ఉపాధి విషయంలో వడ్డెర కులానికి చెందిన సుమారు 55 శాతం మంది దినసరి కూలీలుగానే జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. వీరికి స్థిరమైన నెలవారీ ఆదాయం లేకపోవడం వల్ల అనారోగ్యం వంటి అత్యవసర సమయాల్లో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఈ వర్గాలకు చేరకపోవడం వల్ల వీరు కేవలం శ్రమశక్తిపైనే ఆధారపడాల్సి వస్తోంది.నిపుణుల హెచ్చరిక.. సామాజిక న్యాయం ఎక్కడ?ఈ గణాంకాలను విశ్లేషించిన సామాజికవేత్తలు, ప్రభుత్వం తక్షణమే లక్షిత విధానాలను అమలు చేయాలని సూచిస్తున్నారు. కేవలం సంక్షేమ పథకాలు నగదు బదిలీ మాత్రమే కాకుండా ఈ కులాల్లో విద్యా ప్రమాణాలను పెంచడం, వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడం.. పారిశ్రామికంగా ప్రోత్సహించడం వంటి సమగ్ర చర్యలు తీసుకోవాలి.రాష్ట్ర అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందనప్పుడు, అది కేవలం అంకెల్లో అభివృద్ధిగానే మిగిలిపోతుంది. ఈ సీపెక్ నివేదిక ప్రభుత్వానికి ఒక హెచ్చరిక లాంటిది. ఇప్పటికైనా కులాల వారీగా ఉన్న ఈ భారీ అసమానతలను తొలగించకపోతే, భవిష్యత్తులో సామాజిక అశాంతికి దారితీసే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అంబానీ-అదానీ మధ్య సాగుతున్న రేస్..!



ముంబై, భారత్ కార్పొరేట్ రంగంలో అంబానీ-అదానీ మధ్య సాగుతున్న రేస్ ఆసక్తికరంగా ఉంటుంది. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత భారీ ఒడిదుడుకులను ఎదుర్కొన్న గౌతమ్ అదానీ మళ్లీ అద్భుతంగా పుంజుకొని ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా నిలవడం సంచలనంగా మారింది. భారతీయ వ్యాపార సామ్రాజ్యంలో అగ్రస్థానం కోసం జరిగే పోరులో గౌతమ్ అదానీ పైచేయి సాధించారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.., రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి అదానీ గ్రూప్ ఛైర్మన్ ఆసియాలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా నిలిచారు. గతేడాది ఎదురైన చట్టపరమైన, ఆర్థికపరమైన సవాళ్లను అధిగమించి అదానీ ఈ స్థాయికి చేరుకోవడం మార్కెట్ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.అదానీ వర్సెస్ అంబానీ..ప్రస్తుత మార్కెట్ విలువల ప్రకారం.. ఇద్దరు దిగ్గజాల నెట్‌వర్త్ వివరాలు పరిశీలిస్తే..గౌతమ్ అదానీ: సుమారు $92.6 బిలియన్ల ఆస్తితో ఆసియాలో 1వ స్థానంలో, ప్రపంచ కుబేరుల జాబితాలో 19వ స్థానంలో నిలిచారు.ముకేశ్ అంబానీ: $90.8 బిలియన్ల నికర ఆస్తితో ఆసియాలో 2వ స్థానానికి పడిపోయారు. ప్రపంచ స్థాయిలో ఆయన 20వ స్థానంలో కొనసాగుతున్నారు.కేవలం కొన్ని బిలియన్ డాలర్ల వ్యత్యాసమే ఉన్నప్పటికీ, అదానీ గ్రూప్ షేర్లు మళ్లీ పుంజుకోవడం ఆయన సంపద పెరగడానికి ప్రధాన కారణమైంది.తిరుగులేని పునరాగమనం.. 2023 ప్రారంభంలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక అదానీ సామ్రాజ్యాన్ని కుదిపేసింది. అప్పట్లో ఆయన ఆస్తి భారీగా ఆవిరైపోయింది. సంపన్నుల జాబితాలో చాలా కిందికి పడిపోయారు. కానీ, 2024, 2025లో అదానీ గ్రూప్ చేపట్టిన వ్యూహాత్మక చర్యలు మంచి ఫలితాలను ఇచ్చాయి. సెబీ దర్యాప్తులో అదానీ గ్రూప్‌కు సానుకూల పరిణామాలు ఎదురుకావడం ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచింది. పోర్టులు, విమానాశ్రయాలు, గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్ల రంగంలో అదానీ గ్రూప్ దూకుడుగా ముందుకు వెళ్లడం షేర్ల ధరలు పెరగడానికి దోహదపడింది. అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను గడువు కంటే ముందే చెల్లించడం ద్వారా గ్రూప్ తన ఆర్థిక పటిష్టతను చాటుకుంది.ముకేశ్ అంబానీ వ్యూహం ఏంటి?ముకేశ్ అంబానీ కూడా తన రిలయన్స్ సామ్రాజ్యాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ముఖ్యంగా జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో భారీ పెట్టుబడులు పెడుతున్నారు. అయితే, రిలయన్స్ షేర్లు స్థిరంగా కొనసాగుతుండగా, అదానీ గ్రూప్ షేర్లు వేగంగా పెరగడం వల్ల ఈ స్థానాల్లో మార్పు చోటు చేసుకుంది. రాబోయే రోజుల్లో రిలయన్స్ రిటైల్ లేదా జియో ఐపీఓలకు వెళ్తే.. మళ్లీ అంబానీ అగ్రస్థానానికి వచ్చే అవకాశం లేకపోలేదు.ప్రపంచ కుబేరుల జాబితాలో 'మస్క్' హవాభారతీయ కుబేరుల మధ్య పోటీ ఇలా ఉంటే.., ప్రపంచ స్థాయిలో మాత్రం టెస్లా అధినేత ఎలన్ మస్క్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుంది. సుమారు $656 బిలియన్ల భారీ నెట్‌వర్త్‌తో ఆయన ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నారు. అంటే భారత కుబేరుల ఆస్తి కంటే మస్క్ ఆస్తి దాదాపు 7 రెట్లు ఎక్కువ ఉండడం గమనార్హం. జెఫ్ బెజోస్, బెర్నార్డ్ ఆర్నాల్ట్ వంటి వారు తర్వాతి స్థానాల్లో ఉన్నారు.అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలు ప్రపంచ వేదికపై అగ్రస్థానంలో ఉండడం భారత ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది. వీరిద్దరూ మౌలిక సదుపాయాలు, ఇంధనం, డిజిటల్ రంగాల్లో పెడుతున్న భారీ పెట్టుబడులు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఆసియా కుబేరుడిగా అదానీ మళ్ళీ కిరీటాన్ని దక్కించుకోవడం అనేది భారత కార్పొరేట్ రంగం స్థితిస్థాపకతకు నిదర్శనం.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TElTEL 2010/34557, Cell: 9849758280